
సాక్షి నల్లగొండ

మంగళవారం, 17, జూన్, 2025



నకిలీ బంగారం అంటగట్టి

తక్కువ ధరకే బంగారం బిస్కెట్ ఇస్తామని నమ్మించి నకిలీ బంగారం అంటగట్టి మోసం చేసిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



చరిత్రకు సాక్ష్యం రాజకోట

రాజాపేట మండల కేంద్రంలోని రాజకోటకు ఘన చరిత్ర ఉంది. ఈ కోటను రాజరాయన్న పరిపాలించారు. - 8లో



యువకుల అరెస్ట్

గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. - 8లో

న్యూస్‌రీల్

రైతు భరోసా నిధులు విడుదల

నల్లగొండ అగ్రికల్చర్ : వానకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఎకరానికి రూ.6000 చొప్పున రైతు భరోసాను జమ చేయనుంది. జిల్లాలోని 4,36,944 మందికి సంబంధించి రూ.411,34,37,740 ట్రెజరీకి పంపించింది. సోమవారం సాయంత్రం నుంచి రైతుల ఖాతాల్లో డబ్బు జమవుతోంది. ఇప్పటి వరకు రెండెకరాలలోపు భూమి ఉన్న 3,03,059 మంది రైతుల ఖాతాల్లో రూ.180.09 కోట్లు జమయ్యాయి.

పోలీస్ గ్రీవెన్స్ డేలో వినతుల స్వీకరణ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

నల్లగొండ : పోలీస్ గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం 45 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. బాధితులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యను వెంటనే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారించి.. బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు.

ఐటీఐలో ప్రవేశాలకు నోటిఫికేషన్

రామగిరి(నల్లగొండ) : ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జంజిరాల వెంకన్న తెలిపారు. జూన్ 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు టెన్త్ మెమో, ఆధార్ కార్డు వివరాలు ఒకే విధంగా ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు www.ititelangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

22న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలు

నల్లగొండ టూటౌన్ : చెస్ చాంపియన్ దివంగత మేకల అభినవ్ 35వ జయంతిని పురస్కరించుకొని ఈనెల 22న నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.కరుణాకర్‌రెడ్డి, విశ్వప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-7, 9, 11, 13, 15 బాల, బాలికలకు పోటీలు ఉంటాయని, 50మంది విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9985423823 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నల్లగొండ : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను సోమవారం ఇంటర్ బోర్డు విడుదల చేసింది. జిల్లాలో మొదటి సంవత్సరంలో మొత్తం 7,617 మందికి 5196 ఉత్తీర్ణులై 68.22 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ 3,771 మందికి 2537 మంది ఉత్తీర్ణులై 67.28 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ విభాగంలో మొదటి సంవత్సరం 925 మందికి 641 మంది(69.3 శాతం), ద్వితీయ సంవత్సరంలో 657 మందికి 402 మంది ఉత్తీర్ణులై 61.19 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

తిప్పర్తి : ఉపాధిహామీ పథకం కింద మండలంలోని ఇండ్లూర్, తిప్పర్తి, యర్రగడ్డలగూడెం గ్రామాల్లో చేసిన పనులను ఉపాధిహామీ పథకం జాతీయ కమిటీ సభ్యుడు ఉమాశంకర్, ఏపీడీ నర్సింహారావు సోమవారం పరిశీలించారు. ఇంకుడు గుంతలు, బోర్ రీచార్జి గుంతలు అసంపూర్తిగా ఉండడంతో వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఓ శిరీష, ఈసీ జుల్ఫేకర్ తదితరులు ఉన్నారు.



రీచార్జి గుంతను పరిశీలిస్తున్న ఉమాశంకర్

పల్లెల్లో స్థానిక సందడి!

- నెలాఖరులో ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం
- మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు
- ఆ తరువాతే పంచాయతీలకు..
- సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం
- గ్రామాల్లో మొదలైన రాజకీయ సందడి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గ్రామాల్లో స్థానిక ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమ వుతుండటంతో గ్రామాల్లో రాజకీయ నేతల్లో హడావుడి ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినా.. ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడే పరిస్థితి నెలకొంది. దీనికితోడు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే స్థితిలో ప్రభుత్వం లేదని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటన ఇందుకు ఊతం ఇస్తోంది.

స్థానిక సంస్థల వివరాలు ఇలా..

జెడ్పీటీసీలు	33
ఎంపీటీసీలు	352
గ్రామ పంచాయతీలు	868
ఓటర్లు	10,78,335

మొదట ప్రాదేశిక ఎన్నికలు

మొదట జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించి.. ఆ తర్వాతే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అయితే జూలై రెండో వారంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలంటే ఈ నెల చివరిలోగా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంటుంది. లేదంటే వచ్చే నెల మొదటి వారంలో షెడ్యూల్ ఇస్తే వచ్చే నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించే వీలుంటుంది.

ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రచారం జరగడంతోపాటు ఎన్నికలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామ పంచాయతీల్లో బ్యాలెట్ పేపర్ల ముద్రణ ఏర్పాట్లతో పాటు బ్యాలెట్ బాక్సులను కూడా ఆంధ్రప్రదేశ్ నుంచి తెప్పించి వాటికి మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచారు. గ్రామాలు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేశారు. బ్యాలెట్ పేపర్లను తెచ్చి ఎస్పీ కార్యాలయంలో భద్రపరిచారు. ఎన్నికల సంఘం ఎప్పుడు షెడ్యూల్ ప్రకటించినా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని యంత్రాంగం చెబుతోంది.

బీసీ రిజర్వేషన్లు తేలకపోవడంతో వాయిదా..

బీసీ రిజర్వేషన్ల తేలకపోవడంతో గతంలో నిర్వహించాలనుకున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపు విషయం ఇప్పటికీ కోర్టులో ఉంది. ఆ సమస్య ఎటూ తేలలేదు. కానీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సంసిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

జెడ్పీ చైర్మన్ మినహా మిగతా రిజర్వేషన్లు ఇక్కడే..

జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సంబంధించి ఆయా నియోజక వర్గాల వారీగా ఉన్న జనాభా ఆధారంగా రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. వాటిని కలెక్టర్ ఆధ్వర్యంలోనే ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తారు. అయితే పంపిన జాబితా ఆధారంగా రిజర్వేషన్లకు ప్రభుత్వం ఆమోదించి తిరిగి జిల్లాకు పంపుతుంది. జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్ మాత్రమే రాష్ట్ర స్థాయిలో ప్రకటిస్తారు.

పెరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు

గత ఎన్నికల్లో జిల్లాలో 31 మండలాలు ఉండగా ఆ తరువాత రెండు మండలాలు (గట్టుప్పల్, గుడిపల్లి) కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో రెండు జెడ్పీటీసీ స్థానాలు పెరుగనున్నాయి. దీంతో జెడ్పీటీసీ స్థానాల సంఖ్య 33కు చేరకుంది. అదే విధంగా జిల్లాలో గత ఎన్నికల సమయంలో 349 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇటీవల చేపట్టిన ఎంపీటీసీ స్థానాల పునర్విభజనలో మరో 3 పెరిగాయి. దీంతో ఎంపీటీసీల సంఖ్య 352 చేరింది. ఇక గ్రామ పంచాయతీలు గతంలో 844 ఉండగా.. కొత్తగా 24 పంచాయతీలు పెరిగాయి. దీంతో పంచాయతీల సంఖ్య 868కి చేరింది.

సిద్ధమవుతున్న పార్టీలు

జిల్లాలో రాజకీయ పార్టీలు స్థానిక ఎన్నికలకు సిద్ధం అవుతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజక వర్గాలుంటే సూర్యాపేట మినహా 11 నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు తాము అధికారంలోకి వచ్చాక చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అంతకుముందు పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి విజయం సాధించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మరోవైపు ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లి తమ పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా బీఆర్‌ఎస్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. బీజేపీకి జిల్లాలో ఎమ్మెల్యేలు లేకపోయినా ఓటింగ్ శాతం పెరిగింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రణాళికలు రచిస్తోంది.



గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్

అమ్మా.. మొర ఆలకించరూ..

నల్లగొండ : 'ఏళ్ల తరబడి కలెక్టరేట్ చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కావడం లేదు. తిరిగితిరిగి అలసిపోతున్నాం. మీరే మా మొర ఆలకించి సమస్యలను పరిష్కరించాలి' అంటూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎదుట పలువురు బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా భూ సమస్యలు, పింఛన్లు, ఇతర సమస్యలపై కలెక్టరేట్‌కు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రజల నుంచి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని ఆయా శాఖలకు పంపారు. ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

ఏడేళ్ల నుంచి తిరుగుతున్నా.. పింఛన్ రావడం లేదు



నేను దివ్యాంగుడిని. నడవలేను. నా సొంత పనులకు కూడా ఇతరులపై ఆధారపడాల్సిందే. ఏడేళ్ల నుంచి వికలాంగుల పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా. అధికారులు, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా నా సమస్యకు పరిష్కారం లభించలేదు. పింఛన్ పొందలేకపోతున్నా. పింఛన్ వస్తే నా కుటుంబ సభ్యులకు భారం తగ్గుతుంది. నాకు పింఛన్ ఇప్పించాలి.

– మధు, చెరలతండా, నేరడుగొమ్ము మండలం

వేలిముద్ర పడడం లేదని రేషన్ ఇవ్వలే..



రేషన్ బియ్యం తీసుకునేందుకు నాకు వేలిముద్ర పడటం లేదు. ఐరిష్ రావడం లేదు. నేను రేషన్ షాపు వద్దకు వెళ్తే బియ్యం ఇవ్వడం లేదు. ఓటీపీ ద్వారా బియ్యం ఇద్దామన్నా.. సెల్‌ఫోన్ నంబర్ అడుగుతుండటంతో డీలర్ బియ్యం ఇవ్వలేదు. నడవలేని స్థితిలో మోకాళ్లపై ఇక్కడికి వచ్చాను. నాకు బియ్యం ఇచ్చేలా చూడండి.

– మారయ్య, చర్లపల్లి, నల్లగొండ మండలం

మూడు చక్రాల వాహనం ఇప్పించండి



చిన్ననాటి నుంచి పోలియోతో నడవలేను. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాను. 3 చక్రాల వాహనం కోసం మూడు సార్లు దరఖాస్తు చేసుకున్నా. రాలేదు. నా తండ్రి ప్రైవేట్ ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తాడు. ఆయన పని నిమితం వేరే ఊరికి వెళ్తే కాలేజీలో దించేవారు లేరు. నాకు మూడు చక్రాల వాహనం ఇప్పించాలి.

– మహ్మద్ నస్రుద్దీన్, మిర్యాలగూడ

తప్పుడు డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్లు



అయిటిపాముల గ్రామంలో సర్వే నంబర్ 937లో 3.31 ఎకరాల భూమి ఉంది. 2018లో భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంలో మా పేరు మీద ఉన్న భూమిని కంప్యూటర్ ఆపరేటర్‌తో కుమ్మక్కై 1.30 ఎకరాల భూమిని కొప్పు పద్మ పేరు మీద ముక్కెర సైదులు అలియాస్ ప్రభు ఆన్‌లైన్‌లో నమోదు చేయించాడు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. విచారణ చేపట్టి తప్పుడు రికార్డులు సృష్టించిన విజయ్‌తో పాటు ముక్కెర సైదులు మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదైంది. వారు జైలుకు వెళ్లి వచ్చారు. వారిలో ఒకరైన ముక్కెర సైదులు అలియాస్ ప్రభు అనే వ్యక్తి తన పేరును ముక్కెర వెంకటరమణగా మార్చుకుని గోపగాని జానయ్యతో కలిసి లేని భూమిని ఉన్నట్లుగా సృష్టించి ఆరు తప్పుడు డాక్యుమెంట్లతో సర్వే నెంబర్ 937,938లో 4.9 కుంటల భూమిని తన భార్య సైదమ్మ పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ భూమిలో 3.30 కుంటల భూమిని మరో వ్యక్తికి సైదమ్మ రిజిస్ట్రేషన్ చేసింది. అక్కడ భూమి లేకున్నా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– చెవుగోని శ్రీనివాస్, అయిటిపాముల, కట్టంగూర్ మండలం

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం



వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రిలో మాట్లాడుతున్న మహిళా రైతు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, చింతపల్లి : వ్యవసాయాన్ని పండగ చేయడంలో భాగంగా రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సోమవారం చింతపల్లి మండలంలోని నెల్వలపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులు వాణిజ్య పంటలు పండించేలా ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. సోలార్ ద్వారా పంపుసెట్లు నిర్వహించుకునేలా చూడాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా, నూతన సాంకేతికతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రైతు వేదిక పక్కనే గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చూడాలని ఎమ్మెల్యే కోరగా ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ఆర్డీఓ రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా రైతుతో ముఖ్యమంత్రి ముఖాముఖి

చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు బిక్కని రాణెమ్మ ముఖ్యమంత్రితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తనకు నాలుగెకరాల భూమి ఉందని.. సన్న వడ్లు వేశానని 8 పుట్ల దిగుబడి వచ్చిందని.. బోనస్ కింద రూ.15,000 తన ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. రూ.లక్షా 80 వేలు రుణమాఫీ అయ్యిందని.. రూ.17,100 రైతు భరోసా వచ్చిందని అందుకు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తమ పిల్లలు బాగా చదువుకుంటున్నారని.. ప్రభుత్వం తమను ఇలాగే ఆదుకోవాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి.. రాణెమ్మతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలని చదితేనే భవిష్యత్ ఉంటుందన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌లో సీపీఎం శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, మహమ్మద్ అబ్బాస్ అన్నారు. నల్లగొండలో జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో సోమవారం వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించడంతో కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని విమర్శించారు. ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సయ్యద్ హాశం, దండెంపల్లి సత్తయ్య, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సలీం, కొండ అనురాధ, నలపరాజు సైదులు, మన్నెం భిక్షం, కానుగు లింగస్వామి, పులెంల శ్రీకర్, తుమ్మల పద్మ, సరోజ, కొండ వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

రుణమాఫీ లబ్ధిదారుల వివరాలతో ఫ్లెక్సీ

నల్లగొండ : నల్లగొండ జిల్లాలో రుణమాఫీ పొందిన లబ్ధిదారుల వివరాలతో ఆయా గ్రామ పంచాయతీల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు విడతల్లో 2,33,981 మంది రైతుల ఖాతాల్లో రూ.2004.83 కోట్ల రుణమాఫీ జమ అయ్యిందని తెలిపారు. ఈ వివరాలను గ్రామపంచాయతీల వద్ద ప్రదర్శిస్తామని తెలిపారు. ఎవరెవరికి ఎంత రుణమాఫీ అయ్యిందో రైతులు చూసుకోవచ్చని పేర్కొన్నారు.



నేరెడుగొమ్ము మండలం బచ్చాపురం పంచాయతీలో వివరాలు చూస్తున్న రైతు

యూరియా కోటాలో కోత!

- మోతాదుకు మించి వాడకుండా చర్యలు
- రాయితీ దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట
- భవిష్యత్‌లో పొంచి ఉన్న యూరియా కొరత
- రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు



గుర్రంపోడు : యూరియా కోటాను కేంద్రం తగ్గిస్తోంది. రైతులు అధిక మోతాదులో యూరియా వాడకాన్ని తగ్గించేలా.. రాయితీపై అందిస్తున్న యూరియా పక్కదాటి పట్టకుండా చర్యలు తీసుకుంటోంది. అయితే.. కేంద్రం తీసుకుంటున్న చర్యలతో భవిష్యత్‌లో యూరియా కష్టాలు ఎదురయ్యేలా ఉన్నాయి. జిల్లాలో సాగయ్యే అన్ని పంటలకు కలుపుకుని లక్షా 40 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది. కానీ 30 శాతం తక్కువగా యూరియా కేటాయిస్తున్నారు. సెప్టెంబర్ నాటికి 70 వేల మెట్రిక్ టన్నుల అవసరం. ఇప్పటి వరకు ఏప్రిల్, మే, జూన్ నెలల కోటా 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చింది. నల్లగొండ జిల్లాలో గోదాములు ఎక్కువగా ఉండడంతో యూరియా ఇక్కడికి ఎక్కువగా పంపుతున్నారు. తర్వాత ఇక్కడి నుంచి వేరే జిల్లాలకు పంపేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే జూలై నుంచి జిల్లాకు సరిపడా కోటా విడుదల అవుతుందా.. లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఇప్పటికే 39 వేల మెట్రిక్ టన్నుల యూరియా పాత నిల్వలు ఉండడంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌కు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని అధికారులు భావిస్తున్నారు.

ఓటీపీ, వేలిముద్రతోనే పంపిణీ

వ్యవసాయశాఖ ఇటీవల ఎరువుల డీలర్లకు కొత్త ఈపాస్ యంత్రాలను పంపిణీ చేసింది. యూరియా కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా తమ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని డీలర్‌కు చెప్పడం లేదా వేలిముద్ర వేయడం ద్వారానే యూరియా, ఇతర ఎరువులు కొనాల్సి ఉంటుంది. దీంతో యూరియా పక్కదారి పట్టకుండా పర్యవేక్షణ పక్కాగా ఉండనుంది. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అండగా ఉండేలా.. భారీగా రాయితీతో అందిస్తున్న యూరియా.. పక్కదారి పట్టి రసాయన పరిశ్రమలకు వాడుతుండటం వల్ల రాయితీ దుర్వినియోగం అవుతోంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం ఇప్పటికే నీమ్ కోటెడ్ యూరియాను వినియోగంలోకి తెచ్చింది.

అధిక మోతాదులో వాడితే నష్టమే..

యూరియాతో పోలిస్తే కాంప్లెక్స్ ఎరువుల ధరలు నాలిగింతలు అధికంగా ఉండటం, రసాయన ఎరువుల వాడకంపై సరైన అవగాహనలేకపోవడం వల్ల రైతులు యూరియాను విచ్చలవిడిగా వినియోగించి నష్టపోతున్నారు. ఎకరా వరికి రెండు బస్తాల యూరియా వాడాల్సి ఉండగా నాలుగు నుంచి ఆరు బస్తాల వరకు వాడుతున్నారు. యూరియాను వాడటం వల్ల పైరు పచ్చగా ఏపుగా ఉంటుంది. అధిక మోతాదులో వేసినప్పుడు తేలికగా నీటిలో కొట్టుకుని పోయి పైరుకు ఉపయోగపడదు. మొక్కలు సుకుమారంగా పెరగడం వల్ల చీడపీడలు, తెగుళ్ల బారిన పడతాయి. దీంతో పెట్టుబడి అధికమవుతుంది. వరి పైరు విపరీతంగా పెరిగి కోత సమయంలో పంట దిగుబడి పడిపోతుంది. పూత ఆలస్యంగా వచ్చి పంట కాలం పొడగించబడి దిగుబడి తగ్గుతుంది. వరిలో పూత దశ తర్వాత యూరియాను వేస్తే బియ్యపు గింజలో పొట్ట తెలుపు వచ్చి నూక ఎక్కువ అవుతుంది. అధిక మొత్తంగా యూరియా వాడకం వల్ల కలిగే అనర్థాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

సిఫారసు మేరకే యూరియా వాడాలి



రైతులు ఆయా పంటలకు సిఫారసు మేరకే యూరియాను వాడాలి. యూరియాను అధిక మోతాదులో వాడటం వల్ల చీడపీడలు, తెగుళ్లు అధికమవుతాయి. రైతుల నానో యూరియాను వాడటం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల రసాయన ఎరువులు తగ్గించకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

యూరియా వాడకంలో మెళకువలు

- ద్రవ రూప నానో యూరియా సాధారణ యూరియాతో సమానంగా పనిచేస్తుంది. నానో యూరియాను పిచికారీ చేయడం వల్ల వేగంగా మంచి ఫలితాలు వస్తాయి. రైతుకు బస్తాల భారం తగ్గుతుంది.
- మెట్ట పైర్లలో యూరియా వేసేటప్పుడు నేలలో తేమ ఉండేటట్లు చూసుకోవాలి. మెట్టపైర్లలో యూరియాను చల్లడం కన్నా మొక్క మొదట్లో గుంట తీసి వేస్తే మంచిది.
- పైరుకు సిఫారసు చేసిన యూరియాను రెండు, మూడు దఫాలుగా వేసుకోవాలి.
- యూరియాతోపాటు వేప పిండి (50 కేజీల యూరియాకు 5 కిలోల వేపపిండి) వాడితే నత్రజని మొక్కలకు ఎక్కువ కాలం అంది చీడపీడల వ్యాప్తి తగ్గుతుంది.
- పైరును బట్టి సేంద్రియ ఎరువులు, రైబోజియం మొదలగు జీవన ఎరువులు వాడి యూరియా మోతాదును తగ్గించుకోవచ్చు.
- కాంప్లెక్స్ ఎరువుల్లో కూడా నత్రజని ఉంటున్నందున యూరియాను జోడించి వాడకూడదు.

క్లుప్తంగా

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన సరితనాయక్


సరితనాయక్‌ను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సంస్థాన్ నారాయణపురం: దేశంలో, తెలంగాణలో మొట్టమొదటి మహిళా ఆర్టీసీ బస్సు డ్రైవర్ సరితనాయక్ సోమవారం హైదరాబాద్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృజ్ఞతలు తెలిపింది. సరితనాయక్‌కు మంత్రి శాలువా కప్పి సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): బైక్ అదుపుతప్పడంతో కిందపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నర్సింహపేట మండలం దాట్ల గ్రామానికి చెందిన కాగితం రమేష్ తన మేనల్లుడు రఘువీర్‌తో కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. తిరుమలగిరి మండలం తొండ గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో..

మద్దిరాల: రైస్ మిల్లులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మద్దిరాల మండలం చందుపట్ల గ్రామంలో సోమవారం జరిగింది. నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన జలగం ప్రసాద్(30) కొన్నిరోజులుగా చందుపట్ల గ్రామంలోని ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నాడు. సోమవారం రైస్ మిల్లు యజమాని ఎల్‌సీ తీసుకోకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయమని చెప్పాడు. దీంతో ప్రసాద్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రసాద్ మృతికి మిల్లు యజమాని నిర్లక్ష్యమే కారణమని, నష్టపరిహారం అందజేయాలని అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహాన్ని యజమాని ఇంటి ఎదుట ఉంచి నిరసన తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్‌ఐ వీరన్న తెలిపారు.

ముగ్గురికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: బైక్ అదుపుతప్పడంతో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం పోచంపల్లి మండలం జలాల్‌పురం శివారులోని జరిగింది. ఏపీకి చెందిన వెంకట్, అతడి స్నేహితులు విష్ణు, సుధీర్ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం వారు ముగ్గురు కలిసి బైక్‌పై పోచంపల్లిలో ఉంటున్న మరో స్నేహితుడికి కలవడానికి వస్తుండగా.. జలాల్‌పురం శివారులోని మోడల్ స్కూల్ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో పక్కనే సిమెంట్ దిమ్మెను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో బైక్ వెంకట్ తల పగిలింది. మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

నాటి చరిత్రకు సాక్ష్యం రాజకోట


రాజకోటలోని అంతఃపురం


రాజకోటలోని సైనిక ప్రాంగణం వద్ద ద్వారం


రాజకోటను పరిశీలిస్తున్న సినిమా డైరెక్టర్ అశోక్‌తేజ

- ఎత్తైన బురుజులు, గోడలతో నిర్మాణం
- నేడు పర్యాటక శాఖ అధీనంలో కోట
- సినిమా షూటింగ్‌లు చేసేందుకు ఆసక్తి చూపుతున్న దర్శకులు

రాజాపేట: రాజాపేట మండల కేంద్రంలోని రాజకోటకు ఎంతో ఘన చరిత్ర ఉంది. రాజరాయన్న పరిపాలించిన రాజకోటనే నేడు సంస్థాన్ రాజాపేటగా పిలువబడుతోంది. రాజరాయన్న 1775లో ఈ రాజకోట నిర్మాణం చేపట్టాడు. అప్పటి నిజాం సంస్థాన్ నారాయణపురం, సంస్థాన్ రాజాపేటను కేంద్రంగా చేసుకుని పరిపాలించారు. ఈ రాజకోట శత్రు దుర్భేద్యమైన బురుజులు, ఎత్తైన ప్రాకారాలు కలిగి ఉంది.

కోట నిర్మాణం ఇలా..

రాజకోట నిర్మాణం చేపట్టే సమయంలో పడమటి భాగాన గోపాలపురం గ్రామం ఉండేది. పైభాగాన ఉన్న గోపాలచెరువు ద్వారా గోపాలపురం ముంపునకు గురై కొట్టుకుపోయింది. దీంతో రాజకోట చుట్టూ కందకాలను నిర్మించి పైనున్న ఈ చెరువు ద్వారా నీరు పారించడంతో పాటు శత్రువులు రాకుండా కందకాల్లో మొసళ్లను పెంచేవారు. గ్రామం చుట్టూ ఒక పద్ధతిగా కందకం, కోట గోడ ప్రాకారాలను, ఎత్తైన రాతి బురుజులను నిర్మించారు. రాజాపేట గ్రామం లోపలికి వెళ్లాలంటే మూడు ఎత్తైన ప్రధాన ద్వారాలు ఉండేవి. ఈ ద్వారాలు దాటి మరో ప్రధాన ద్వారం దాటితేనే రాజకోటలోకి అడుగు పెట్టాల్సి ఉంటుంది. గ్రామం చుట్టూ సర్కిల్‌గా ఎత్తైన రాతిగోడ నిర్మాణం చేసి ప్రతీ మూలమలుపులో వృత్తాకారం బురుజులు ఏర్పాటు చేశారు. ఇలాంటి బురుజులు సుమారు 50కి పైగా ఉంటాయి. ఈ బురుజుల ద్వారా శత్రువులపై దాడి చేయడానికి సలసల కాగే నూనె పోయడానికి, తుపాకీతో గురిపెట్టడానికి రంధ్రాలు ఏర్పాటు చేశారు.

గ్రామం నడిబొడ్డు వరకు సొరంగమార్గాలు..

రాజుల పరిపాలనకు అనుగుణంగా రాజకోట నిర్మితమైంది. కోటలోపల రాజ నివాసం, అంతఃపురం, అద్దాలమేడ, గిరిగిరిమాల్, అతిథి గృహం, సైనిక ప్రాంగణం, కారాగారాలు, ధర్మ గంట, నీటి కొలనులు, తాగునీటి కోసం రెండు కోనేరులు, శ్రీరామ, ఆజనేయస్వామి, గ్రామ దేవతల దేవాలయాలు, ఏనుగుల మోట వంటివి ఏర్పాటు చేసుకుని పరిపాలించారు. కోటపై శత్రువులు దండెత్తి ప్రమాదం పొంచి ఉంటే ఆ సమయంలో రాజ కుటుంబీకులు తమ ప్రాణాలు కాపాడుకునేందుకు రాజకోట నుంచి గ్రామం నడిబొడ్డుకు, గ్రామం పొలిమేర వరకు సొరంగ మార్గాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో అరుదైన దేవాలయాల్లో ఒకటైన సత్యనారాయణ దేవాలయాన్ని రాజుల కాలంలోనే నిర్మించారు.

పరిపాలనా చరిత్ర

అప్పటి నిజాం పరిపాలనలో 14 సంస్థానాలు ఉండేవి. అందులో ప్రధానంగా సంస్థాన్ నారాయణపురం, సంస్థాన్ రాజాపేట కేంద్రంగా కార్యకలాపాలు జరిపేవారు. రాజరాయన్న కోట నిర్మాణం చేపట్టగా అతడి తర్వాత తన కుమారుడు రాజా వెదిరె వెంకటనారాయణరావు బహదూర్ రాజ్యాధికారం చేపట్టాడు. ఈయన పరిపాలనలో దేవాలయాలు నిర్మాణం, గొలుసు కట్టు చెరువులు చేపట్టి కొంత భూములు దానం చేశాడు. ఇతడి పరిపాలనలోనే సంస్థాన్ నారాయణపురం ఏర్పాటు జరిగింది. అనంతరం రాజా వెదిరె వెంకటనారాయణరావు కుమారుడు రాజా జశ్వంత రావు పరిపాలించాడు. ఈయన కుమారులే ఆర్‌డీ భూపాల్, కృష్ణపరాత్తర రావు. జశ్వంత రావు తన తల్లి జానకమ్మ పేరున పండ్లతోట నిర్మించాడు. ప్రస్తుతం ఈ రాజకోట పర్యాటక శాఖ వారికి అప్పగించారు.

సినిమా షూటింగ్‌ల నిర్వహణ

రాజకోటలో సినిమా షూటింగ్‌లు సైతం నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రముఖ తెలుగు సినిమా డైరెక్టర్ అశోక్ తేజ కోటను సందర్శించారు. ఓదెల రైల్వేస్టేషన్, ఓదెల–2 వంటి సినిమాలు తీసిన ఆయన తర్వలో భారీ బడ్జెట్‌తో రూపొందించే సినిమా లోకేషన్ల పరిశీలనలో భాగంగా రాజకోటను సందర్శించారు.


కారాగారం చుట్టూ ఏర్పాటు చేసిన బురుజుపై డంగుసున్నంతో నిర్మించిన రోడ్డు


రాజాపేట చుట్టూ నిర్మించిన రాతిగోడకు వృత్తాకార బురుజులు

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

- ఒక కిలో మూడొందల గ్రాముల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం

కోదాడరూరల్: గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను అనంతగిరి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను సోమవారం కోదాడ రూరల్ సీఐ కార్యాలయంలో డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి విలేకరులకు వెల్లడించారు. అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన కనగాల సతీష్, అనంతగిరికి చెందిన షేక్ సైదాబాబు, బడేటి వెంకటేష్, చెవుల శ్రీకాంత్ స్నేహితులు. వీరు కొంతకాలంగా గంజాయి కొనుగోలు చేసి కొంత సేవిస్తూ.. మరికొంత విక్రయిస్తున్నారు. వీరికి పరిచయం ఉన్న మిర్యాలగూడకు చెందిన భానుప్రకాష్ ఈ నెల 8న కనగాల సతీష్‌కు ఫోన్ చేసి తాను ఒరిస్సాలోని మల్కాన్‌గిరిలో ఉన్నానని, గంజాయి కొనుగోలు చేసి కోదాడకు తీసుకొస్తున్నానని చెప్పాడు. ఈ నెల 11వ తేదీన అనంతగిరిలోని చాకలిగుట్ట వద్దకు ఒక కిలో మూడొందల గ్రాములు గంజాయిని భానుప్రకాష్ తీసుకొని వచ్చాడు. అందులో ఒక కేజీని రూ.10వేలకు కనగాల సతీష్‌కు, మిగిలిన 300 గ్రాములను మిగిలిన ముగ్గురికి విక్రయించి బైక్‌పై వెళ్లిపోయాడు. వారు ఆ గంజాయిని ఆ గుట్ట వద్దనే రాళ్ల మధ్యలో దాచి పెట్టి అవసరమైనప్పుడు తీసి సేవిస్తున్నారు. సోమవారం కూడా గుట్ట వద్ద గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించగా.. నలుగురు పట్టుబడ్డారు. గంజాయి విక్రయించిన భానుప్రకాష్ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి ఒక కిలో మూడొందల గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ రజితారెడ్డి, అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ అజయ్‌కుమార్, సిబ్బంది నిరంజన్, సతీష్, శ్రీను, నరసింహ పాల్గొన్నారు.

గంజాయి విక్రయించేందుకు వస్తుండగా..

గంజాయి విక్రయించేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులను కోదాడ పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన షేక్ అలీం, మాలోతు సాయి స్థానికంగా ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నారు. అదే మిల్లులో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన సందీప్‌కి గంజాయి తాగే అలవాటు ఉండటంతో అతడి వద్దకు అలీం, సాయి కూడా వెళ్లి గంజాయి తాగేవారు. వీరికి కొమరబండకు చెందిన తమలపాకుల సిద్ధు పరిచయం కాగా అందరూ కలిసి గంజాయిని సిగరెట్లలో పెట్టుకొని తాగేవారు. అలీం, సాయి, సిద్ధు గంజాయి అమ్మి డబ్బులు సంపాదించాలని బిహార్‌కు చెందిన సందీప్ వద్ద అర కేజీ గంజాయి రూ.2వేలకు కొనుగోలు చేశారు. సోమవారం కోదాడ శివారులోని దుర్గాపురం క్రాస్ రోడ్‌లో గల మామిడి తోటలో గంజాయి విక్రయించేందుకు వస్తుండగా.. ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సందీప్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి అర కేజీ గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పోచంపల్లిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు


చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్ అధికారులు


చేనేత వస్త్రాలను ధరించి చూస్తున్న ట్రైనీ ఐఏఎస్ అధికారి

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లిలోని టూరిజం పార్కు, చేనేత సహకార సంఘం కార్యాలయాలను సోమవారం ఐదుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు సందర్శించి అక్కడ మగ్గాలు, ఇక్కత్ వస్త్రాల తయారీని పరిశీలించారు. అదేవిధంగా చేనేత కార్మికుల జీవన స్థితిగతులు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ పెద్దబోయిన మాట్లాడుతూ.. 2024 బ్యాచ్ తెలంగాణ క్యాడర్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు సౌరభ్‌శర్మ, సలోని చబ్రా, హర్షచౌదరి, కారోలిన్ చింగిత్మియి, కొయ్యడ ప్రణయ్‌కుమార్‌కు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమ, చేనేత కార్మికుల జీవన స్థితిగతులను తెలుసుకోవడానికి వారు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారని తెలిపారు. వారి వెంట యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ పద్మజ, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ పి. శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మినీ క్రాఫ్ట్స్ హస్తకళల కేంద్రం పరిశీలన..

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం టెక్స్‌టైల్ పార్కులోని మినీ క్రాఫ్ట్స్ హస్తకళల కేంద్రాన్ని సోమవారం ట్రైనీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. నూలు నుంచి తయారు చేస్తున్న వస్త్రాలను పరిశీలించారు. పర్యావరణానికి హాని కల్గకుండా ప్రకృతి సిద్ధమైన రంగులతో వస్త్రాలను తయారు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హస్తకళల కేంద్రం నిర్వాహకురాలు పుష్పలత, నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ అభయారణ్యంలో..

భువనగిరి: భువనగిరి మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో గల ఆంజనేయ అభయారణ్యాన్ని సోమవారం సాయంత్రం ఐదుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు అర్యణం గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆర్డీఓ కృష్ణారెడ్డి, అటవీశాఖ అధికారులు ఉన్నారు.

పీజీ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందించాలి

నల్లగొండ టూటౌన్ : పీజీ కళాశాలలు నాణ్యమైన విద్యను అందించాలని ఎంజీ యూనివర్సిటీ వీసీ ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఆయన సోమవారం ఎంజీ యూనివర్సిటీలో పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 75 శాతం హాజరు నియమాన్ని విధిగా పాటించాలని సూచించారు. అందుకు బయోమెట్రిక్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు లైబ్రరీ, పరిశోధన సదుపాయాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆడిట్‌సెల్ డైరెక్టర్ వై.ప్రశాంతి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జయంతి, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీసీ ఖాజాఅల్తాఫ్ హుస్సేన్

నకిలీ బంగారం అంటగట్టి మోసం

- ఇద్దరి అరెస్ట్
- రూ.4లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లు, అర గ్రాము బంగారం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ: తక్కువ ధరకే బంగారం బిస్కెట్ ఇస్తామని నమ్మించి నకిలీ బంగారం అంటగట్టి మోసం చేసిన ఇద్దరు నిందితులను నల్లగొండ సీసీఎస్, వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం డీఎస్పీ శివరాంరెడ్డి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వెల్ల డించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్ల గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో వేముల రాజు అనే వ్యక్తి అనస్వి మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. గతేడాది నవంబర్ 8వ తేదీన సాయంత్రం రాజు షాపులో ఉండగా.. ఏపీలోని గుంటూరుకు చెందిన ఏసు, లక్ష్మి కలిసి రాజు నిర్వహిస్తున్న మెడికల్ షాపు వద్దకు వచ్చి మందులు కావాలని అడిగారు. ఈ క్రమంలో వారు రాజుతో పరిచయం చేసుకున్నారు. ఏసు తన పేరు రవి అని, ఏపీలోని ఒంగోలు జిల్లాలో బిల్డర్‌గా పనిచేస్తున్నట్లు రాజుతో పరిచయం చేసుకున్నాడు. తన దగ్గర కొంత పాత బంగారం ఉందని, దానిని తక్కువ ధరకు ఇస్తానని చెప్పాడు. ఈ మేరకు ఒక బంగారం బిల్లను రాజుకు చూపించి, దానిని పరీక్షించుకోమని అందులో నుంచి ఒక ముక్క తీసి ఇచ్చాడు. రాజు బంగారం షాపునకు వెళ్లి చెక్ చేయించగా అది ఒరిజినల్ అని తెలిసింది. అనంతరం రూ.5లక్షలు ఇస్తే బంగారం బిస్కెట్ ఇస్తానని సదరు వ్యక్తి రాజుకు చెప్పాడు. దీంతో రాజు రూ.5లక్షలు ఇచ్చి బంగారం బిస్కెట్ తీసుకున్నాడు. ఆ తర్వాత దానిని చెక్ చేయించగా అది నకిలీదని తేలింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన రాజు నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. నల్లగొండ సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి పక్కా సమాచారం మేరకు సోమవారం నల్లగొండ డీఈఓ ఆఫీస్ వద్ద ఏసు, లక్ష్మిని పట్టుకుని విచారించగా.. తామే నకిలీ బంగారం అంటగట్టి మోసం చేసినట్లు ఒప్పుకున్నారు. ఏసు గుంటూరు జిల్లాలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడని, అతడు జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలై సులువుగా డబ్బు సంపాదించడానికి ఇలా మోసాలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. అతడు గతంలో కూడా హైదరాబాద్‌లోని కుషాయిగూడలో, నల్లగొండలో చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లాడని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.4లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లు, అర గ్రాము బంగారం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

తక్కువ ధరకు బంగారం అమ్ముతానని

నల్లగొండ: బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపిస్తే.. అదే బంగారాన్ని తక్కువ ధరకు అమ్ముతానని నమ్మబలికి మోసం చేసిన వ్యక్తిని నల్లగొండ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని పాతబస్తీలో బంగారం షాపు నిర్వహిస్తున్న చేపూరి కిషన్‌కు ఈ నెల 11న కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన పల్లె మధుకర్ రెడ్డి ఫోన్ చేసి.. తన బంగారం బ్యాంకులో తాకట్టులో ఉందని, డబ్బులు కట్టి విడిపిస్తే ఆ బంగారం తక్కువ ధరకు అమ్ముతానని చెప్పాడు. దీనికి కిషన్ ఒప్పుకోగా.. అతడి చేత నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజార్‌లో గల యాక్సిస్ బ్యాంకులో మధుకర్‌రెడ్డి నగదు డిపాజిట్ చేయించాడు. అనంతరం బంగారం గురించి అడిగితే అకౌంట్ ఫ్రీజ్ అయిందని మాయమాటలు చెప్పడంతో తాను మోసపోయానని గ్రహించిన కిషన్ నల్లగొండ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమవారం నల్లగొండ పట్టణంలో మధుకర్‌రెడ్డిని వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని అతడి నుంచి 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. మధుకర్‌రెడ్డి గతంలో హైదరాబాద్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో సేల్స్ మేనేజర్‌గా పనిచేశాడని, 2023లో జాబ్ మానేసి స్టాక్ మార్కెట్‌లో డబ్బులు పెట్టి నష్టపోయాడని డీఎస్పీ పేర్కొన్నారు. మధుకర్‌రెడ్డిపై గతంలో హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్, జూబ్లీహిల్స్‌తో పాటు నిజామాబాద్‌లో పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీఐలు జితేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐలు శివ, సైదులు, శంకర్, రబ్బాని, శ్రీకాంత్, షకీల్ పాల్గొన్నారు.

కూతుళ్లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయులు


అజ్జిలాపురం పాఠశాలలో తన కుమార్తెకు అడ్మిషన్ ఇస్తున్న ప్రధానోపాధ్యాయుడు నవీన్


వెంకటేశ్వరనగర్ హైస్కూల్‌లో తన కూతురు కోసం అడ్మిషన్ తీసుకుంటున్న ఉపాధ్యాయురాలు శ్రీవాణి

మర్రిగూడ: ప్రభుత్వ ఉపాధ్యాయులైన భార్యాభర్తలు వారి కూతుళ్లను తాము బోధించే పాఠశాలల్లోనే చేర్పించారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల పరిధిలోని అజ్జిలాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాపోలు నవీన్ తన రెండవ కుమార్తె అమూల్యను తాను పనిచేస్తున్న పాఠశాలలోనే 4వ తరగతిలో చేర్పించారు. నవీన్ భార్య ఎం.శ్రీవాణి చింతపల్లి మండలం మాల్‌లోని వెంకటేశ్వరనగర్ హైస్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. వారి పెద్ద కుమార్తె అనన్యను వెంకటేశ్వరనగర్‌లోని పాఠశాలలో 9వ తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే పాఠశాలల బలోపేతానికి కృషి చేసిన వారమవుతామని అన్నారు. ఇరువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు.